క్లుప్తంగా

పూర్తయిన పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



క్రోసూరు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయినట్లు ఆయా బూత్‌ల పోలింగ్ అధికారులు ఎం.శేఖర్, శ్రీను నాయక్‌లు బుధవారం తెలిపారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో ఎన్నికల ఓటింగ్ కొరకు రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 1,548 మంది ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు ఇద్దరు పీవోలు, ఇద్దరు ఏపీవోలు, రూట్ అధికారులుంటారని తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలీసులు 144, 30 ఏ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రరావు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద 100 నుంచి 200 మీటర్ల పరిధి వరకు పోలీసు చట్టం అమలులో ఉంటుందన్నారు. ఈ పరిధిలో దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడటం, మద్యం విక్రయాలు నిషేధమని ఎస్ఐ తెలిపారు. చట్ట విరుద్ధంగా ప్రవరిస్తే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్

అచ్చంపేట: మండలంలో ఈ నెల 27న జరిగే కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం 1484 మంది ఓటర్లు ఉండగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో రెండు, తాడువాయిలో ఒకటి పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు సకాలంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దారు శ్రీనివాసయాదవ్ కోరారు.

వెండి నాగాభరణం సమర్పణ



యడ్లపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాశివునికి వెండి నాగాభరణాన్ని భక్తులు సమర్పించారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కాలంలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలో దూరి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. దీంతో గ్రామానికి చెందిన బళల హరినారాయణ, సీతారావమ్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఆలయ ధర్మకర్త సాంబశివరావుకు సమర్పించారు. వెంటనే స్వామివారికి వాటిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు సీతారావమ్మ, కుమారుడు, కోడలు బళల వెంకటేశ్వరరావు, పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు మైదవోలు ఎంపీపీఎస్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

యడ్లపాడు: ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మైదవోలు మండల బీసీ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం జీవీ హేమలత చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారన్నారు. ఆమెతో పాటు డీవైఈఓ షేక్ సుభాని, యడ్లపాడు ఎంఈఓ 1,2లు ఎంవీ నాగరత్నం, ఎం.అరుణకుమారి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కేవీ రామిరెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై ఈ ప్రదర్శనశాలను విజయవంతం చేయాలని కోరారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ

వినుకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రామలింగేశ్వరస్వామి కొలువైన వినుకొండ కొండ చుట్టూ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం నుంచి ప్రారంభమైన ఈ గిరి ప్రదక్షిణ కొండ చుట్టూ తిరిగి మళ్లీ కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గుడి వద్ద ముగిసింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్‌కుమార్, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కొంజేటి నాగ శ్రీను రాయల్, బీజేపీ నాయకుడు మేడం రమేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నూజెండ్ల: లక్ష్యాలను నిర్దేశించుకొని చదివితే ఉన్నతస్థాయికిచేరుకోవచ్చని గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నూజెండ్లలో కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పి.ఉమాదేవి, సీడీపీఓ ఎం.అనురాధ, ప్రిన్సిపాల్ ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో 17,045 మంది ఓటర్లు
- డివిజన్ వ్యాప్తంగా మొత్తం 21 పోలింగ్ కేంద్రాలు
- నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల(గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పట్టణం, 9 మండలాల్లో పురుషులు 11,376 మంది, మహిళలు 5,667 మంది, థర్డ్ జెండర్ ఇరువురితో మొత్తం ఓటర్లు 17,045 మంది ఉన్నారు. మొత్తం 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను పోలింగ్‌కు అన్ని సౌకర్యాలతో సిద్ధం చేశారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, అధికారులు బుధవారం పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణాకాంతరెడ్డి, అధికారులు

సత్తెనపల్లి నియోజకవర్గంలో...

సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలు ఇలా .. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 342, 343, 344, 345, సత్తెనపల్లి రూరల్‌లో పట్టణంలోని పాత కేంద్రీయ విద్యాలయంలో 346, 347, ముప్పాళ్ళ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 348, 349, రాజుపాలెంలోని ఎంపీపీ స్కూల్ (హెచ్)లో 350, 351, నకరికల్లు శ్రీవంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 352, 353 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పెదకూరపాడు నియోజకవర్గంలో...

బెల్లంకొండ, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లో 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బెల్లంకొండలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 333, అచ్చంపేట మండలంలోని శ్రీతుమ్మలపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 334, 335, మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 336, అమరావతిలోని ఎస్ఆర్ కేహెచ్ స్కూల్‌లో 337, 338, పెదకూరపాడులో 339, క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 340, 341 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి పట్టణంలో అత్యధికంగా ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా .. అత్యల్పంగా పెదకూరపాడు, బెల్లంకొండ మండలాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సత్తెనపల్లి డివిజన్‌లో పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు ఇలా...

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సత్తెనపల్లి టౌన్	04	2,514	1,612	01	4,127
సత్తెనపల్లి రూరల్	02	848	404	-	1,252
ముప్పాళ్ళ	02	968	498	-	1,466
రాజుపాలెం	02	954	321	-	1,275
నకరికల్లు	02	1,204	440	-	1,644
పెదకూరపాడు	01	844	463	-	1,307
అమరావతి	02	1,496	846	-	2,342
అచ్చంపేట	03	1,044	439	01	1,484
క్రోసూరు	02	1,046	488	-	1,534
బెల్లంకొండ	01	458	156	-	614
మొత్తం	21	11,376	5,667	02	17,045



పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

ఓట్ల వేటలో నేతలు

పోటీలో ఉన్న అభ్యర్థులు విజయం కోసం నేతలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మంగళవారం సాయంత్రంతో ప్రచారం పరిసమాప్తం కాగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల నాయకులు తమదైన శైలిలో ప్రచారం చేశారు. ప్రస్తుతం ఫోన్‌లలో పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రధానంగా అధికార కూటమి, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. కూటమి అభ్యర్థికి మద్దతుగా నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార బలం, ఆర్థిక బలం ఉన్న అభ్యర్థులను పీడీఎఫ్ అభ్యర్థులు ఓడించి శాసనమండలిలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈసారి ఎలాగైనా గెలవాలని కూటమి పాలకులు స్థానిక నాయకులను ఆదేశించారు. దాంతో స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తరహాలో ఇంటింటా ప్రచారం సాగించారు. దూర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను వారి స్వగ్రామాలకు రప్పించడానికి ఏర్పాట్లు చేశారు. వారికి ఏమాత్రం తీసిపోకుండా పీడీఎఫ్ అభ్యర్థి తరఫున ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఓట్లు అభ్యర్థించారు. వారికి పట్టభద్ర ఓటర్లు స్వచ్ఛందంగా మద్దతు తెలియజేస్తున్నారు.

క్వారీ స్థలం చుట్టూ ఫెన్సింగ్



నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్‌కు చెందిన క్వారీ స్థలం చుట్టూ గ్రామ పంచాయతీ అధికారులు ఫెన్సింగ్ వేశారు. ఈ స్థలంలో స్థానికంగా ఉన్న కంపెనీల వ్యర్థాలు, ఇళ్ల వ్యర్థాలు పడవేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. అంతేకాక వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ రహదారిపై వ్యాపించి వాహనచోదకులకు దారి కనిపించక సమస్యగా మారింది. పొగ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసన, పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నామంటూ సీఆర్ కళాశాల విద్యార్థులు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయటంతో పాటూ వ్యర్థాలను పడవేసే వారిపై చర్యలు తీసుకుంటామని బోర్డును ఏర్పాటు చేశారు.


విద్యుత్ వైరు తెగిపడి పొలంలో జొన్నపంట దగ్ధం

10 ఎకరాల్లో రూ.5 లక్షల నష్టం

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన రైతు దుగ్గెంపూడి రామాంజినేయులకు చెందిన జొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై రూ.5 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాలు మేరకు కనమర్లపూడి గ్రామం పెదకంచర్ల కాల్వ పరిధిలోని 12 ఎకరాలు కౌలుకు తీసుకొని గడ్డి జొన్న పంట సాగు చేశాడు. వారం రోజుల వ్యవధిలో చేతికివచ్చే సమయానికి విద్యుత్ వైరు పొలంలో తెగిపడి పంట సుమారు 10 ఎకరాల్లో తగలబడింది. ఈక్రమంలో పొలంలో జొన్న పంట అంతా కాలిపోయింది. పక్కపొలం రైతు సమాచారం ఇవ్వగా హుటాహుటిన రైతులు పొలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కనమర్లపూడి గ్రామ విద్యుత్ లైన్‌మెన్ వచ్చి విద్యుత్ సరఫరా నిలుపుదల చేశాడు.

హరహర మహాదేవ.. శంభో శంకర

ముల్లోకాలను ఏలే ముక్కంటికి ప్రీతికరమైన మహాశివరాత్రి రోజున విశేషంగా హర నామస్మరణ మార్మోగింది. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ప్రాశస్త్యమైన శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భోళా శంకరునికి అభిషేకాలు నిర్వహించారు. సర్వాంతర్యామి అయిన జటాధరుడిని పిల్లల నుంచి పెద్దల వరకు ఉపవాస దీక్షలు, జాగరణలు చేసి భక్తి ప్రపత్తులతో పూజించారు.



రాజుపాలెంలో స్వామి వారికి అభిషేకం చేస్తున్న పూజారి



సత్తెనపల్లిలోని శివాలయంలో పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు



ప్రత్యేక అలంకరణలో పెదమక్కెన గంగా భ్రమరాంబ



నర్శింగపాడులోని చంద్రమౌళీశ్వర ఆలయంలో అన్నపూర్ణాదేవి

- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు

సత్తెనపల్లి: హర హర మహాదేవా.. శంభో శంకరా .. ఓం నమః శివాయ.. అంటూ భక్తులు శివుడుని దర్శించుకొని పరవశం చెందారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తరలివచ్చిన భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. అభిషేక ప్రియుడైన భోళా శంకరునికి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శైవ క్షేత్రాల వద్ద భక్తులు జాగరణ చేస్తూ లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవం వేడుకలను వీక్షించారు. ఆదిదంపతులైన శివపార్వతులను దర్శించుకుని తరించారు. శైవ క్షేత్రాల వద్ద అన్న సంతర్పణలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పెదమక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, కంటెపూడిలోని శివాలయంతో పాటు పలు గ్రామాల్లోని శైవ క్షేత్రాల్లో బుధవారం మహాశివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అచ్చంపేట రోడ్‌లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్న సంతర్పణను స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి సనిమెళ్ళ కోటిరెడ్డి, కార్యనిర్వహణ కమిటీ బాధ్యులు దేవతి సుబ్బారావు (మెమంటో), చిల్లంచర్ల కళ్యాణ్, బచ్చు మురళీకృష్ణ, పెరుమాళ్ళ అమర్, జవ్వాజి రవికృష్ణ, ఇమ్మిడిశెట్టి సంపత్, కొప్పురావూరి వెంకట్రామయ్య, గంగారపు నవీన్ తదితరులు ఉన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. దక్షిణ కాశి ఆలయాలుగా ప్రసిద్ధి గాంచిన నర్శింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చేజర్లలోని గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వరస్వామి ఆలయం, నకరికల్లు, దేచవరం, గుండ్లపల్లి గ్రామాల్లోని మల్లేశ్వర స్వామి ఆలయాలు, చల్లగుండ్లలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, నర్శింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, కండ్లకుంట, చాగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారికి పంచామృతాభిషేకాలు జరిపించారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పలు ఆలయాల్లో స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. స్వామి వారి కల్యాణం కనుల పండువగా సాగింది. లింగోద్భవ కాల దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. చేజర్ల కపోతేశ్వరాలయంలో అర్చకులు వెంకట్రామయ్యశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు, బలిహరణ నిర్వహించారు. గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. పలు ఆలయాల్లో జాగరణ కోసం వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం శివరాత్రి పర్వదిన పూజలు వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు వేకువ జాము నుంచే ఆలయాలకు తరలివెళ్లారు. మన్నెసుల్తాన్‌పాలెం అటవీ ప్రాంతం పరిధిలో ఉన్న గుడిబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పాపాయపాలెంలోని బుగ్గ మల్లేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వెంకటాయపాలెంలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అన్ని శివాలయాల్లో రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో ప్రభలు ఆకట్టుకున్నాయి.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని బ్రాహ్మణపల్లిలో వేంచేసి ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి(మరకతలింగం) దేవాలయానికి భక్తులు పోటెత్తారు. పూజారి కోనూరి నరసింహ శ్రీనివాసశర్మ స్వామి వారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రంగులతో ముస్తాబు చేశారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పూజలు, అభిషేకాలు వైభవంగా జరిగాయి. వేకువ జామున 4 గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, శివకేశవుల సహస్ర, అష్టోత్తర శతనామార్చనలు, భజన కార్యక్రమాలు, ప్రసాద వితరణ నిర్వహించారు. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని ప్రముఖ వేదపండితులు పులపుల ఫణికుమార శర్మ, కోటమర్తి అనిల్‌కృష్ణ శర్మల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. మాదిపాడు వద్ద ఉత్తరవాహినిగా ప్రవహించే కృష్ణానది రేవులో పవిత్ర స్నానాలు చేసి నదికి ఆవలి ఒడ్డున ఉన్న ముక్త్యాలలో ముక్తేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పడవలపై తరలివెళ్లారు. చామర్రు కృష్ణానది ఒడ్డున ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో మహాశివ రాత్రి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో స్వామి వార్లకు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ముప్పాళ్ళలోని కాశీఅన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, మాదలలోని సంగమేశ్వర ఆలయం, నార్నెపాడులోని భీమేశ్వరస్వామి, దమ్మాలపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలో స్వామి వారికి విశేష పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి దాటాక ఆయా ఆలయాల్లో స్వామి వారికి లింగోద్భవ కాల అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మండలంలో మహాశివరాత్రి మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. 75 తాళ్లూరులో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అంజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటల నుంచి అన్నదానం నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాల అభిషేకాలు చేశారు. అనంతరం పార్వతి పరమేశ్వరులకు శాంతి కల్యాణం జరిపారు. గురువారం రాత్రికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

క్రోసూరులో...

క్రోసూరు: మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం మండలంలోని పలు గ్రామాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకుని భక్తులు అమరావతి, కోటప్పకొండలోని శైవక్షేత్రాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. బస్సులు, ఆటోలు భక్తులతో కిటకిటలాడాయి. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ కమిటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వెంకటాయపాలెంలోని రామలింగేశ్వరుడు



నర్శింగపాడులోని కపోతేశ్వరస్వామి ఆలయంలో...



కాశీవిశ్వేశ్వర ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



సత్తెనపల్లిలోని శివాలయంలో పూజల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ముక్తేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పడవలలో వెళుతున్న భక్తులు



నార్నెపాడులోని భీమేశ్వరస్వామి



సత్తెనపల్లిలోని శివాలయంలో క్యూలో భక్తులు



75 తాళ్లూరులో పూజల్లో భక్తులు